ఓయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

భగ్గుమన్న విద్యార్థి లోకం!

వియ్ వాంట్ జస్టిస్

వర్సిటీ భూములు హైకోర్టుకు ఇవ్వొద్దని డిమాండ్

- జీవో 55 రద్దు చేసేవరకు ఉద్యమిస్తామని స్పష్టీకరణ
- వ్యవసాయ వర్సిటీ, ఉస్మానియా పరిధిలో ఆందోళనలు
- నాలుగో రోజు నిరసన జ్వాలలు
- నాన్ టీచింగ్ ఉద్యోగుల మద్దతు

వ్యవసాయ యూనివర్సిటీ / సికింద్రాబాద్ /కాశీబుగ్గ, జనవరి 11: హైకోర్టుకు వ్యవసాయ వర్సిటీ భూములను కేటాయించడంపై విద్యార్థి లోకం భగ్గుమన్నది. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కొనసాగుతున్నది. ప్రభుత్వ నిర్ణయంపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 4వ రోజైన గురువారం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంతోపాటు ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ వద్ద, వరంగల్‌లో విద్యార్థులు కదం తొక్కారు. జీవో 55ను రద్దు చేసేవరకు విశ్రమించబోమని స్పష్టంచేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం

వర్సిటీ భూముల పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం అయ్యాయి. వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు తరగతులు బహిష్కరించి, వంటావార్పు నిర్వహించారు. శాస్త్రవేత్తలు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు.. విద్యార్థుల ఉద్యమానికి మద్దతు తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి వ్యవసాయవర్సిటీ విలువ తెలియకపోవడం విడ్డూరమన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, బాలకోటినాయక్, శంకర్ నాయక్, రాకేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్సిటీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద బైఠాయించారు. వ్యవసాయ అనుబంధ సంస్థల అభివృద్ధికి కేటాయించిన భూముల్లో హైకోర్టు నిర్మాణంపై ఉన్నత న్యాయస్థానంలోని మేధావులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్య క్ష, కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, అమృత్‌రెడ్డి కోరారు. అనేక జీవరాసులకు , చెట్లకు నెలవై జీవరాశి మనుగడకు దోహద పడుతున్న వర్సిటీ భూములను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఓయూలో ఏబీవీపీ శాఖ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనంచేసింది. జీవో నంబర్ 55ను వెంటనే రద్దు చేయాలని ఆల్ స్టేట్ యూనివర్సిటీ కన్వీనర్ జీవన్ డిమాండ్ చేశారు. వర్సిటీకి చెందిన 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మిస్తే బయోడైవర్సిటీ పార్కు లో ఉన్న జీవవైవిధ్యం కోల్పోతామని ఆందోళన వ్యక్తంచేశారు. ఇక్కడ 350కి పైగా పక్షులు, జంతువులు, 450కి పైగా వృక్ష జాతులు, వృక్ష ఔషధ జాతులు 80, తీగ జాతులు 30 ఉన్నాయని, హైకోర్టు నిర్మాణంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. కార్యక్రమం లో ఏబీవీపీవర్సిటీ కార్యదర్శి బట్టు పరశురామ్, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్స్ కమల్‌సురేశ్, అలివేలు రాజు, స్టేట్స్ శ్రావిష్కార్ కన్వీనర్ తోట శ్రీనివాస్, నాయకులు వికాస్, గణేశ్, వెంకటేశ్, హరిప్రసాద్, దృహన్, కోటేశ్వర్, శివ, శంకర్, రోహిత్, రోహన్, సాద్విక్, అర్జున్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా ఆరెపల్లిలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వెంటనే జీవో 55ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. యూనివర్సిటీ భూములను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

రియల్ వ్యాపారానికి ప్రకృతి బలి

- హైకోర్టు తరలింపుతో అరుదైన జీవావరణానికి నష్టం
- హైకోర్టు పరిరక్షణ సమితి రౌండ్ టేబుల్ సమావేశం

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నినాదాలు చేస్తున్న హైకోర్టు పరిరక్షణ సమితి సభ్యులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ): హైకోర్టుకు వ్యవసాయ వర్సిటీ భూముల కేటాయింపును పౌరసమాజం తీవ్రంగా వ్యతిరేకించింది. రియల్ వ్యాపారానికి, సంపన్న వర్గాలకు లబ్ధిచేకూర్చేలా, వర్సిటీ భూములకు డిమాండ్ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడింది. హైకోర్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాదులు, పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. హైకోర్టు పరిరక్షణ సమితి ప్రతినిధులు బర్ల మల్లేశ్ యాదవ్, శారదాగౌడ్, రిటైర్డ్ ప్రొఫెసర్ వాసుదేవరావు, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, హైకోర్టు న్యాయవాది భార్గవ్ తదితరులు రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. చారిత్రక, వారసత్వ నేపథ్యం ఉన్న హైకోర్టు తరలింపు వెనుక పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. పరిరక్షణ సమితి సభ్యులు శారదాగౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా పాలన కొనసాగిస్తామంటూ అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కారు హైకోర్టు తరలింపు విషయంలో ఎవరితో సంప్రదింపులు చేసిందని మండిపడ్డారు. ఇప్పటివరకు రెండు పర్యాయాలు జరిగిన జనరల్ బాడీ సమావేశంలోనూ ఈ ప్రతిపాదనను తిరస్కరించిన విషయాన్ని గ్రహించాలని అన్నారు. వంద ఎకరాల్లో కొత్త హైకోర్టును కట్టడం కంటే వందేళ్ల చరిత్ర కలిగిన హైకోర్టును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదని స్పష్టంచేశారు. పౌర హక్కుల కోసం పరితపించే న్యాయవాదులే తమ హక్కులకు భంగం కలుగుతుందని రోడ్డెక్కాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో అప్పులు పేరుకుపోయాయని చెప్పిన సీఎం రేవంత్.. ఇంతా హడావిడిగా కొత్త హైకోర్టుకు నిధులు కేటాయించడం, విడుదలకు చర్యలు తీసుకోవడం దేనికని ప్రశ్నించారు. పర్యావరణానికి తీవ్ర నష్టంచేసేలా ప్రభుత్వం నిర్ణయం ఉన్నదని రిటైర్డ్ ప్రొఫెసర్ వాసుదేవరావు మండిపడ్డారు. జీవావరణాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని హితవు పలికారు.

ప్రజాపాలన పేరిట దగా పాలన

ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయాలు సేకరించాల్సిన ప్రభుత్వమే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నదని హైకోర్టు న్యాయవాది బర్ల మల్లేశ్‌యాదవ్ ఆరోపించారు. వ్యవసాయం, సాగు పరిశోధనలకు ఆధారమైన సారవంతమైన భూమలలో హైకోర్టు నిర్మిస్తే.. భవిష్యత్తులో పరిశోధనలకు అవసరమైన నేలలను ఎక్కడి నుంచి తీసుకువస్తారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎంలు చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి కూడా హెచ్‌సీయూలాంటి భూములను లాక్కున్నారని గుర్తుచేశారు. వర్సిటీ భూముల పరిరక్షణ, తరలింపు నిలిపివేసేంత వరకు తాము పోరాడుతామని స్పష్టంచేశారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో దగాపాలనకు నిదర్శనంగా హైకోర్టు తరలింపు జరుగుతున్నదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. హైకోర్టు పేరిట డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నదని ప్రశ్నించారు. బుద్వేల్, శంషాబాద్, గండిపేట్ పరిసరాల్లో ఉన్న సంపన్న వర్గాలకు చెందిన న్యాయాధికారులకు లబ్ధి చేకూర్చే విధంగా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. హైకోర్టును తరలించేందుకు కేటాయించిన నిధులతో రాష్ట్రంలోని కింది స్థాయి కోర్టులను బలోపేతం చేయవచ్చని అన్నారు. పేదల ఇంటి వద్దకే న్యాయ వ్యవస్థను తీసుకుపోవచ్చని చెప్పారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన లక్ష్యాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగించేలా ఈ కొత్త హైకోర్టు నిర్మాణం ఉన్నదని మండిపడ్డారు. ప్రభుత్వం పునారాలోచన చేసేంత వరకు హైకోర్టుకు వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టంచేశారు.

భూముల కేటాయింపు వెనుక కర్ణాటక రియల్ మాఫియా

కర్ణాటక రియల్ ఎస్టేట్ మాఫియా కనుసన్నుల్లోనే అగ్రి బయోడైవర్సిటీ పార్కు భూముల కేటాయింపులు జరిగాయని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ఆరోపించారు. ఈ భూ కేటాయింపు వల్ల విలువైన వన సంపదను నిర్వీర్యం కావడంతోపాటు వన్యప్రాణులు కూడా హరించిపోయే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేయాల్సిన ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతిని సర్వనాశనం చేసే విధంగా అరుదైన జీవవైవిధ్యానికి కేంద్రంగా ఉన్న ఆ భూములను కేటాయించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, బుద్వేల్‌కు హైకోర్టు తరలింపును నిలిపివేయాలని, అక్కడి వన సంపదను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

పచ్చదనంలో చిచ్చు

మొదటిపేజీ తరువాయి...

హైకోర్టు నిర్మాణానికి కేటాయించి జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నదని పర్యావరణ పరిశోధకులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ పరిశోధనలకు కీలకం

వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం జీవవైవిధ్యానికి, వ్యవసాయ పరిశోధనలకు కీలకమైన ప్రాంతం. దక్కన్ పీఠభూమిలో ఉన్న వైవిధ్యమైన వాతావరణ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులపై విశ్లేషణ చేయడానికి వీలుగా ఈ ప్రాంతంలో అగ్రి బయోడైవర్సిటీ పార్కును ఏర్పాటు చేశారు. దాదాపు 2.5 లక్షల వృక్ష సంపదతో, అంతకు మించిన జీవరాశులతో నిండిన ఈ భూముల్లో హైకోర్టు కట్టాలని చూడటం ఎందుకు? అనే ప్రశ్న పర్యావరణ పరిశోధకుల్లో ఉత్పన్నం అవుతున్నది. వ్యవసాయ వర్సిటీలో 2014 నుంచి 2024 మధ్య దాదాపు 67 కొత్త వంగడాలను సృష్టించి దేశంలోనే 4వ స్థానంలో నిలిచింది. 187 రకాల అగ్రి టెక్నాలజీలను అభివృద్ధి చేయడంలో కీలకంగా పనిచేసింది.

విద్యార్థులకు అవగాహన కోసం..

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 2008లో అప్పటి ప్రభుత్వం బయోడైవర్సిటీ పార్కును ఏర్పాటు చేసింది. దక్కన్ పీఠభూమిలోని భౌగోళిక స్థితిగతులకు అనుగుణంగా ఇందులోని భూములను తీర్చిదిద్దింది. 200 ఏండ్ల నాటి వంగడాలను సేకరించడంతోపాటు వాటిని పెంచుతూ భావితరాలకు అందించడంలో ఈ భూములే ప్రధాన ఆధారంగా నిలిచాయి. అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి బయోడైవర్సిటీ పార్కు ప్రాధాన్యం గుర్తించి ఏర్పాటు చేసేందుకు సహకరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ అంశాలను పరిగణనలోకి తీసుకొని వ్యవసాయ వర్సిటీ భూములను హైకోర్టుకు ధారాదత్తం చేసిందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒక్క చెట్టు ఏడాదికి రూ.32 లక్షల విలువ చేసే ఆర్థిక సంపదకు కారణం అవుతుంది. అగ్రికల్చర్ వర్సిటీలో 6 లక్షల చెట్లు ఉండగా, బయో డైవర్సిటీ పార్కులో 2.5 లక్షల చెట్లు ఉన్నాయని వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. అదే విధంగా 20 రకాల కమ్యూనిటీ వృక్షాలు, 681 రకాల వృక్ష, మొక్క జాతులు, 400 రకాల జంతువులు, పక్షులతో జీవ వైవిధ్యం ఈ ప్రాంతంలో కొలువై ఉన్నదని చెప్తున్నారు. ఈ ప్రభుత్వానికి ఏమాత్రం అవగాహన లేకుండా భూములు సమకూర్చడం ఆందోళన కలిగిస్తుంది. ఎలాంటి సంప్రదింపులు లేకుండా వందల ఎకరాల భూములను హైకోర్టుకు ఏకపక్షంగా కేటాయించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.భూములను కేటాయించుకుంటూ పోతుంటే భవిష్యత్తులో పరిశోధనలు ఎలా సాధ్యం? ఆలోచన చేయాలని రిటైర్డ్ ప్రొఫెసర్ వాసుదేవరావు సూచించారు.

విలువైన లంగ్ స్పేస్

హైదరాబాద్ నగరంలో విలువైన లంగ్ స్పేస్‌కు నిలయంగా ఈ వ్యవసాయవర్సిటీ ఉన్నది. ఒక్క చెట్టు ఏడాదికి రూ.32 లక్షల విలువైన ఆర్థిక సంపదను సమాజానికి అందిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలా 20 ఏండ్ల జీవిత కాలంలో ఎన్నో లక్షల కోట్ల విలువైన సంపద బయో డైవర్సిటీ పార్కు ద్వారా అందుతుందని చెప్తున్నారు.

తెలంగాణ నుంచి పోటీకి సోనియాను అభ్యర్థించాం

న్యూఢిల్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి అభ్యర్థించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో గురువారం జరిగిన పార్లమెంట్ కో-ఆర్డినేటర్ల సమావేశంలో తెలంగాణ నుంచి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం చేయాల్సిన వ్యూహ రచనపై అధిష్ఠానం దిశానిర్దేశం చేసినట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించినట్టుగానే ప్రజలు కాంగ్రెస్‌ను పార్లమెంటు ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాల్లో గెలిపిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు, మీడియాకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలిలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్యే కోటాలోని రెండు స్థానాల భర్తీకి గురువారం నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఎమ్మెల్సీలుగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరిలు రాజీనామా చేయడంతో ఏర్పడ్డ ఖాళీల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల నాలుగో తేదీన షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. షెడ్యూల్‌లో పేర్కొన్నట్టు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర శాసనసభలో ఈ మేరకు రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండు స్థానాలకు వేర్వేరుగా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఒక స్థానానికి తెల్లరంగు బ్యాలెట్, మరోదానికి గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలను ఎన్నికల కోసం వినియోగించాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈ నెల 18వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 19వ తేదీన నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. 22వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీగా నిర్ణయించారు. ఈ నెల 29న ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌ను నిర్వహించనున్నారు. అదే రోజున ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఆ పార్టీలు ఎవరిని బరిలో దింపుతాయన్న దానిపై స్పష్టత రాలేదు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెల్చుకునే బలం ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఏయే పార్టీలు పోటీలో ఉంటాయో తేలిపోనున్నది. ఒకవేళ ఒక్క పార్టీ అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉంటే వారే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటిస్తారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు?

- ఎమ్మెల్యే కోటాలో చిన్నారెడ్డి, అద్దంకి దయాకర్?
- గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరాం, జాఫర్ జావెద్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్, మాజీ మంత్రి, డాక్టర్ జీ చిన్నారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అభ్యర్థిత్వాలను పార్టీ అధిష్ఠానం ఖరారు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. గవర్నర్ కోటా లో ఎమ్మెల్సీలుగా తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, విద్యాసంస్థల (ముఫకమ్ ఝా) అధినేత జాఫర్ జావేద్‌ను ఎంపిక చేసినట్టు కాంగ్రెస్ వర్గాల సమాచారం. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కోటాలో సీటును ఆశిస్తున్న ఆశావహులు చాలామంది ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని సీనియర్లకు అధిష్ఠానం అవకాశం కల్పించినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు మద్దతునిచ్చిన తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాంకు ఇచ్చిన హామీ మేరకు గవర్నర్ కోటాలో ఆయనను ఎమ్మెల్సీగా ఎంపిక చేసినట్టు తెలిసింది. మరో స్థానానికి విద్యాసంస్థల యజమాని జాఫర్ జావేద్‌కు అవకాశం కల్పించినట్టు చెప్తున్నారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో జోక్యం చేసుకోలేం

- తేల్చి చెప్పిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): శాసనసభ్యుల కోటా కింద ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ సీట్లకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేయడాన్ని సవాల్ చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈసీ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. గురువారం జారీ అయిన ఈసీ నోటిఫికేషన్ రాజ్యాంగ నిబంధనలకు లోబడే ఉందని చెప్పింది. ఒకే ఓటును ప్రాధాన్య క్రమంలో దాఖలు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందడంతో శాసనమండలిలో వారి స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ రెండు స్థానాలకు ఎన్నికల కమిషన్ ఈ నెల 4న షెడ్యూల్ విడుదల చేసింది. అయితే ఆ రెండు స్థానాలకు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీచేసింది. తెలుపు, గులాబీ రంగుల బ్యాలెట్ పేపర్లను వినియోగిస్తున్నట్టు ఈసీ ప్రకటించింది. దీనిని మాజీ మంత్రి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి కుమారుడు, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి పీ కార్తీక్ రెడ్డి సవాల్ చేస్తూ దాఖలు చేసిన వ్యాజ్యంపై గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. నోటిఫికేషన్ వెలువడ్డాక కోర్టుల జోక్యానికి వీల్లేదని రాజ్యాంగంలోని 329(బి) అధికరణం స్పష్టం చేస్తున్నదని ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ అన్నారు. ఈ వాదనను ఆమోదించిన హైకోర్టు పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది.

ప్రకృతి వనాలు ధ్వంసం

- సిరిసేడు, బోగంపాడులో 4,430 చెట్ల తొలగింపు
- రూ.6,44,436 నష్టం.. నలుగురి అరెస్ట్, రిమాండ్

ఇల్లందకుంట, జనవరి 11: కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంసిరిసేడు, బోగంపాడులో భూకబ్జా కోసం ప్రకృతి వనాలను ధ్వంసం చేసిన నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్టు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు ప్రకృతి వనాల పెంపకం కోసం సిరిసేడు శివారులో 20 గుంటల చొప్పున ఎకరం కేటాయించగా, 4,430 మొక్కలు నాటారు. కాగా, సిరిసేడుకు చెందిన రేణుకుంట్ల చిన్నరాయుడు, రామస్వామి కలిసి ప్రకృతి వనాల్లోని చెట్లను తొలగించి భూమిని కబ్జా చేయడానికి గ్రామానికే చెందిన ఎక్స్‌కవేటర్ యజమాని రమేశ్‌కు 10 వేలు ఇచ్చారు. ఈ నెల 7న ప్రకృతి వనాల్లోని 4,430 చెట్లను తొలగించి భూమిని చదును చేశారు. పంచాయతీ కార్యదర్శులు అంకూస్, శ్రీనివాస్ ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి, రేణుకుంట్ల చిన్నరాయుడు, రామస్వామి, రమేశ్, డ్రైవర్ శశికుమార్‌ను నిందితులుగా గుర్తించారు. గురువారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

పెట్టుబడులకు సానుకూలంగా తెలంగాణ

- సీఎంతో మైక్రాన్ అధినేత సంజయ్ భేటీ
- డిజిటలైజేషన్‌లో భాగస్వాములవుతాం: గూగుల్

రేవంత్‌రెడ్డితో సమావేశం అయిన మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్, సీఈవో సంజయ్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఉన్నదని ప్రపంచంలోనే అతిపెద్ద మెమరీ చిప్ తయారీ కంపెనీ మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్, సీఈవో సంజయ్ మెహ్రోత్రా అన్నారు. అమెరికా నుంచి ప్రత్యేకంగా వచ్చిన సంజయ్ గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మైక్రాన్ కంపెనీ ఆసక్తి చూపితే రాష్ట్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపన, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి కల్పనతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మైక్రాన్ కంపెనీ సెమీ కండక్టర్ల తయారీలో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద కంపెనీగా, చిప్ తయారు చేసే అతి పెద్ద సంస్థల్లో ఒకటిగా ఉన్నది.

సీఎం రేవంత్‌రెడ్డితో గూగుల్ వైస్ ప్రెసిడెంట్ భేటీ

గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులపై సీఎంతో చర్చించడంతోపాటు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తున్నదని, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో తెలంగాణ కోసం డిజిటలైజేషన్ ఎజెండాను అభివృద్ధి చేయడంలో భాగస్వాములమవుతామని చెప్పారు. తెలంగాణ పౌరుల అవసరాలను తీర్చడంలో నాణ్యమైన సేవలను అందించడానికి విస్తృత సాంకేతికత, నైపుణ్యం తమ వద్ద ఉందని చంద్రశేఖర్ వివరించారు. గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ ప్లాట్ ఫారమ్‌లను ఉపయోగించి సాధ్యమయ్యే రహదారి భద్రతపై కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు డీ శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంతో హార్వర్డ్ వర్సిటీ బృందం భేటీ

అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన అధ్యాపకుల బృందం గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకుంది. డాక్టర్ డొమినిక్ మావో నేతృత్వంలోని షెఫాలీ ప్రకాశ్, ఆండీ రైట్ బృందం సీఎంతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ బృందం రాష్ట్ర విద్యాశాఖతో కలిసి 'ప్రోగ్రామ్ ఆఫ్ సైంటిఫికల్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్షిప్' (పీఎస్‌ఐఎల్-24) పేరుతో 5 రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 33 జిల్లాల నుంచి పదో తరగతి, ఇంటర్ చదువుతున్న 100 మంది విద్యార్థులు, 40 మంది హైస్కూల్ టీచర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 7న ప్రారంభమైన కార్యక్రమం శుక్రవారంతో ముగుస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు లబ్ధి చేకూరేలా ఏడాది పొడవునా విద్యాశిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రొఫెసర్ డీ రవీందర్, విద్యాశాఖ కమిషనర్ దేవసేన తదతరులు పాల్గొన్నారు.

తెలంగాణలో చెల్లని నాణెం

షర్మిల ఏపీకా?

- ఆమెకు పీసీసీ పదవి ఇస్తే పార్టీకి ఇబ్బందులే: హర్షకుమార్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బిడ్డగా ప్రచారం చేసుకున్న వైఎస్ షర్మిలకు ఆంధ్రలో పీసీసీ అధ్యక్ష పదవి అప్పగిస్తారన్న ప్రచారంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ హర్షకుమార్ మండిపడ్డారు. ఒక రాష్ట్రంలో చెల్లని నాణెం మరో రాష్ట్రంలో ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. ఆమెకు పీసీసీ ఇస్తే ఆంధ్రలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఏపీలో కాంగ్రెస్‌ను బ్రతికించే నాయకులే లేరా అని ఆవేదన వ్యక్తం చేశారు. షర్మిలకు పీసీసీ పదవిని కాంగ్రెస్ నాయకులు ఎవరూ ఆమోదించరని హర్షకుమార్ స్పష్టం చేశారు. తెలంగాణలో లీడర్‌షిప్ కావాలనుకున్న షర్మిలను తీసుకొచ్చి ఏపీలో పెడితే ఆంధ్రవాళ్లకు ఆత్మాభిమానం దెబ్బతింటుందని అన్నారు. అన్న వైఎస్ జగన్, చెల్లెలు షర్మిల ఇద్దరూ ఒకటేనని, వారిని నమ్మే పరిస్థితుల్లో ఎవరూ లేరని వెల్లడించారు. ఢిల్లీలో తాను మోదీని చూసుకుంటానని, నువ్వు సోనియాను చూసుకో అని శిక్షణ ఇచ్చి షర్మిలను ఢిల్లీకి పంపించి కాంగ్రెస్‌లో చేర్పించారని ఆరోపించారు. భవిష్యత్తులో కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ఇద్దరూ సేఫ్‌గా ఉంటామనే భరోసా ఇచ్చారని విమర్శించారు.

కాంగ్రెస్‌ది హిందూ వ్యతిరేక ధోరణి

- ప్రాణ ప్రతిష్ఠను బహిష్కరించడాన్ని ప్రజలు క్షమించరు
- పూజిత అక్షింతలు అందజేస్తున్న వారి అరెస్టు దుర్మార్గం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): అయోధ్యలో జరుగనున్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని బహిష్కరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక ధోరణిని బయటపెట్టుకున్నదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆయన గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 500 ఏండ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న రామ మందిర నిర్మాణం కల సాకారమైందని చెప్పారు. శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు.. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన ప్రముఖులు, కవులు, కళాకారులు, సాధుసంతులను, సామాజిక సంస్థలను, సీఎంలను, రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నదని చెప్పారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధీర్ రంజన్‌ను శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు ఆహ్వానించిందని తెలిపారు. అభద్రతాభావంతో, కుహనా లౌకికవాదంతో, సూడో సెక్యులరిస్టులుగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తూ ఆహ్వానాన్ని తిరస్కరించారని మండిపడ్డారు. ఓటుబ్యాంకు రాజకీయ కోణంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏండ్లుగా శ్రీరాముడి ఉనికినే దాచిపెట్టిందన్నారు. అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతలను భక్తిభావనతో ప్రతి ఇంటికి పంపిణీ చేస్తుంటే సికింద్రాబాద్‌లోని సింధూ కాలనీలో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు.



శ్రీనివాస్

శ్రీధర్

సీఎం పీఆర్వోలుగా మరో ఇద్దరు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజా సంబంధాల అధికారులు(పీఆర్వో)గా మరో ఇద్దరు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బొల్గం శ్రీనివాస్, మామిడాల శ్రీధర్‌ను కాంట్రాక్టు పద్ధతిలో పీఆర్వోలుగా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. సీనియర్ జర్నలిస్టు అయిన బొల్గం శ్రీనివాస్ గతంలో ఈనాడు, సాక్షిలో పనిచేశారు. ప్రస్తుతం వెలుగు బ్యూరోచీఫ్‌గా పనిచేస్తున్నారు.

'భూమాత' తొలి భేటీ

- ధరణి పునర్నిర్మాణ కమిటీ సమావేశం
- ఇకపై సీసీఎల్ఏ కేంద్రంగా కార్యాచరణ
- 17న మరోమారు సమావేశం

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): భూ సంబంధిత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ గురువారం సచివాలయంలో తొలిసారి సమావేశమైంది. కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్‌కుమార్, రేమండ్‌పీటర్, మధుసూదన్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్, సీఎంఆర్వో డైరెక్టర్ లచ్చిరెడ్డి హాజరయ్యారు. సుమారు రెండు గంటలపాటు సమావేశం కొనసాగింది. అనంతరం కోదండరెడ్డి, లచ్చిరెడ్డి, సునీల్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ధరణి పునర్నిర్మాణంపై ఇది ప్రాథమిక సమావేశం మాత్రమేనని చెప్పారు. కమిటీ విధివిధానాలు, ఏయే అంశాలపై దృష్టిసారించాలో చర్చించినట్టు తెలిపారు. పోర్టల్‌లో సుమారు 40-50 రకాల సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిపై రైతులకు భరోసా కల్పించడం తోపాటు, ప్రభుత్వానికి వేగంగా సలహాలు ఇవ్వడంపై దృష్టిసారించినట్టు వివరించారు. కమిటీ ఇకపై సీసీఎల్ఏ కార్యాలయం నుంచి పనిచేస్తుందని, ఇందుకోసం తమకు ప్రత్యేక గది, సిబ్బంది కేటాయింపు వంటివి చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. నిపుణులు, ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలను అక్కడ స్వీకరిస్తామని పేర్కొన్నారు. భూ సంబంధ సమస్యలపై తాము ఎలాంటి దరఖాస్తులు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఇబ్బందులు ఉన్నవారు ప్రస్తుత విధానంలోనే ధరణి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. తుది నివేదిక ఇవ్వడానికి ఎక్కువ కాలం పడుతుందని పేర్కొన్నారు. ఆలోగా ఎప్పటికప్పుడు మధ్యంతర నివేదికలు ఇస్తామని చెప్పారు. ఈ నెల 17వ తేదీన కమిటీ రెండోసారి సమావేశమవుతుందని, అప్పుడు మరిన్ని అంశాలపై స్పష్టత వస్తుందని చెప్పారు.